క్లుప్తంగా

పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్ల పంపిణీ



ఖండవల్లిలో రెయిన్‌కోట్లతో పారిశుధ్య సిబ్బంది

పెరవలి: వర్షాకాలం కావడంతో పారిశుధ్య సిబ్బందికి దాత సహకారంతో రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఖండవల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న 20 మంది పారిశుధ్య సిబ్బందికి అదే గ్రామానికి చెందిన భూపతిరాజు శ్రీరామరాజు రెయిన్ కోట్లు సోమవారం అందజేశారు. పారిశుధ్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు



తాడిపూడి ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్నారని చెబుతున్న ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఇసుక ర్యాంపులు మూసి వేసినట్టు జిల్లా అధికారాలు ఆదేశించినప్పటికీ తాడిపూడి ర్యాంపు నుంచి ఇసుక రవాణా సాగుతోందని తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన తాడిపూడి ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఈ ర్యాంపు నుంచి ఇసుక అధికారులకు తెలిసి వెళుతోందా, లేక అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్నారా అన్నది అనుమానంగా ఉందని సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డిమాండ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు



తాళ్లపాలెం-సింగవరం మధ్య రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న దాత బయ్యే వెంకట్రావు

నిడదవోలు రూరల్: నిడదవోలు ఆర్వోబీ నిర్మాణ పనులు దృష్ట్యా అధికారులు వాహనాలు దారి మళ్లించడంతో సింగవరం-తాళ్లపాలెం రోడ్డు అధ్వానంగా తయారైంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో దాత శెట్టిపేటకు చెందిన కాంట్రాక్టర్ బయ్యే వెంకట్రావు స్పందించి సొంతంగా రూ.1.50 లక్షలు వెచ్చించి పలు చోట్ల రోడ్డు మరమ్మతులు చేయడంతో పాటు తాళ్లపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద గోతులు పూడ్చి రోడ్డు వేశారు. దీంతో ప్రయాణికులు వెంకట్రావును అభినందిస్తున్నారు.

ఎల్ఐసీ జాతీయీకరణలో ఏఐఐఈఏ పాత్ర కీలకం

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ జాతీయీకరణలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రముఖ పాత్ర పోషించిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. ఆ యూనియన్ ఏర్పడి 75వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆవిష్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు మా.థ్యూస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి, సంఘ ఆవశ్యకతను తెలిపారు. కోదండ రామ్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రభుత్వ రంగంలో ఉండటం వల్ల ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడంతో పాటు, కోట్లాది పాలసీ దారులు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ సేవలు అందిస్తోందన్నారు. అనంతరం సభ్యులందరికీ చేత సంఘం ఐక్యత కాపాడతామని, యూనియన్ అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఐఐఈఏ ప్లాటినమ్ జూబ్లీ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మహిళా కన్వీనర్ చేతుల మీదుగా నిర్వహించారు.

భోజన విరామంలో నిరసన

ఈ నెల 9వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ప్రధాన కార్యదర్శి కోదండ రామ్ మాట్లాడుతూ జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ప్రజలకు భారంగా మారిన జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, కార్మికుల హక్కులను హరించే కొత్త లేబర్ కోడ్‌లను తొలగించాలని, ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గన్నెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు, డివిజనల్ ఆఫీసు యూనిట్ కార్యదర్శి విశ్వనాథ్, రూరల్ బ్రాంచ్ తరపున జి.శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల నాయకులు పాల్గొన్నారు.

ఆగని వర్షం.. స్తంభించిన జీవనం

- తడిసి ముద్దవుతున్న మెట్ట
- ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రోడ్లపైకి చేరిన వర్షం నీరు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సోమవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో వర్షం కురవడంతో రోడ్ల పక్కన గల చెట్లు, ఇళ్లలోని కొబ్బరి చెట్లు నేలకూలాయి. యర్నగూడెంలో కొబ్బరి చెట్టు విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ గ్రామంలో రాత్రి 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

- దేవరపల్లిలో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. యర్నగూడెం తూర్పు వీధిలోని బీసీ ఏరియాలో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- యాదవోలు నుంచి పొంగుటూరు ఆర్అండ్‌బీ రోడ్డు బురదతో చిత్తడిగా తయారైంది. ఆ రోడ్డుపై జిగురు మట్టి చేరడంతో వాహనాలు అదుపుతప్పి జారిపోతున్నాయి.
- దేవరపల్లిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు అన్ని రోడ్లపైనా వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. రాత్రి సమయంలో ఆ నీటిలో పాములు సంచరిస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.
- దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో డ్రైనేజీ నీరు, వర్షం నీటితో కలసి రోడ్లపై నిలిచిపోయింది.
- మురుగునీటికి దోమలు చేరడంతో ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. రోడ్లపై నిలిచిపోయిన నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి పలు గ్రామాల్లో కుండపోత వర్షం కురుస్తోంది.



దేవరపల్లిలో జోరుగా కురుస్తున్న వర్షం



వర్షాలకు చిత్తడిగా మారిన పొంగుటూరు రోడ్డు



యర్నగూడెంలో విద్యుత్ తీగలపై కూలిపోయిన కొబ్బరి చెట్టు



యర్నగూడెం బీసీ ఏరియాలో రహదారి దుస్థితి



తాడేపల్లిలో మంగళవారం జరిగిన రాష్ట్ర యూత్ విభాగం సమావేశం అనంతరం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ ముచ్చికర్ల రవి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.
- గోపాలపురం

పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల జలాలు విడుదల

నిడదవోలు : రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి మంగళవారం 5,800 క్యూసెక్కుల గోదావరి జలాలను కాలువలకు విడుదల చేస్తున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలకు కూడా నీటి విడుదలను అధికారులు తగ్గించారు. నరసాపురం కాలువకు 1774 క్యూసెక్కులు, తణుకు కాలువకు 605, ఏలూరు కాలువకు 907, అత్తిలి కాలువకు 288 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయగా ఉండి కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు

తాళ్లపూడి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. అన్నదేవపేట పంచాయతీ పరిధిలోని సూరయ్య పేట వైఎస్సార్ కొత్త కాలనీ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం చేతుల వద్ద, చెవులు, ముక్కుపై పగల గొట్టారు. మరోసారి మంగళవారం కూడా విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు నాయకులతో కలిసి విగ్రహాన్ని పరిశీలించి, ఆందోళన చేశారు. ఓ పథకం ప్రకారం ధ్వంసం చేశారన్నారున్నారు. దోషులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. తాళ్లపూడి పోలీసులకు, తహసీల్దార్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ మరోసారి విగ్రహం ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.



సూరయ్యపేట వైఎస్సార్ కొత్త కాలనీ వైఎస్సార్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చాగల్లు: గ్రామ శివాలయం సమీపంలో మోటారుసైకిల్‌ను మినీవ్యాన్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం చాగల్లు-చిక్కాల రోడ్డులో శివాలయం వద్ద జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గాయపడడంతో 108లో వారిని ఆస్పత్రికి తరలించారు.

సువర్ణ వర్తకుల సంక్షేమానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: సువర్ణ వర్తకుల సంక్షేమం, భద్రతకు సువర్ణ వర్తక సంఘం నిరంతరం పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. గుండువారి వీధిలోని సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపంలో మంగళవారం నగరంలోని సువర్ణ వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నెబో కంపెనీ రీజినల్ మేనేజర్ దుప్పాల సుధీర్ మాట్లాడుతూ బంగారం, వజ్ర ఆభరణాలు వంటి విలువైన వస్తువులే కాకుండా విలువైన డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు గన్నెబో స్టీలేజ్ లాకర్లు నమ్మకమైనవన్నారు. జ్యూయలరీ సంస్థలు తమ ఉత్పత్తులను సురక్షితంగా ఉంచుకోవడానికి బీఐఎస్ సర్టిఫికేషన్ కలిగిన సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఏదైనా చోరీ, అగ్ని ప్రమాదం సంభవించినా బీమా పరిష్కారం కావాలంటే టార్చ్ అండ్ టూలా (టీఆర్‌టీఎల్) రెసిస్టెన్స్ గల సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, కార్యదర్శి గంటా ప్రకాష్, గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, రాష్ట్ర సువర్ణ వర్తక సంఘం కార్యదర్శి దొండపాటి జయసింహ, సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపం అధ్యక్షుడు బొడ్డు రామారావు, వెత్సా బాబ్జీ, సప్పా వెంకటరమణ, లక్కోజి వీరభద్రరావు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రముఖులు

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం

తాళ్లపూడి: అన్నదేవరపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొండే అంబేద్కర్ మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు, నాయకులు సందర్శించారు. అంబేద్కర్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు ఎలిపే రాజు, నూతంగా సురేష్ తదితరులున్నారు.



అన్నదేవరపేటలో కొండే అంబేద్కర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలారి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం కుమార షష్టి సందర్భంగా కె.సావరంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదల ఆకలి తీర్చడం దైవ కార్యం

సీటీఆర్ఐ: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దైవ కార్యంతో సమానమని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మన గుడి, మన సేవ ఉభయ రాష్ట్రాల ఆధ్యాత్మిక సేవా పురస్కారం, రాజహంస పురస్కార గ్రహీత జి.సుబ్రహ్మణ్య పట్టాభి శాస్త్రి శాలువతో చిన్న వెంకన్నబాబును సత్కరించారు. నగరంలోని సుమారు వెయ్యి మంది అనాథలు, యాచకులు, వృద్ధులకు అన్న వితరణ చేశారు. గాడాల గ్రామంలోని పీఠంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరోపకారం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మాత్రమే అది సాధ్యమన్నారు. ఆషాఢ మాసంలో వారాహి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల విశేష పూజాఫలం దక్కుతుందన్నారు.



చిన్న వెంకన్నబాబును సత్కరిస్తున్న పట్టాభి శాస్త్రి

ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ అధికారి, లెఫ్టినెంట్ డాక్టర్ షేక్ ఈసుబ్ బాషా మాట్లాడుతూ సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 22 నుంచి జూలై ఒకటో తేదీ వరకూ 18వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో మేజర్ మహమ్మద్ కె.ఆసిఫ్ సారథ్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం జరిగిందన్నారు. దీనికి జిల్లాలోని వివిధ కళాశాలలు, స్కూళ్లకు చెందిన 550 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారన్నారు. వారిలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన 42 మంది ఉన్నారన్నారు. ఆ శిబిరంలో డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, యోగా, వ్యాయామం, పరిసరాల పరిశుభ్రత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, ఆర్మీ చరిత్ర వంటి అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడేట్లు డ్రిల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, సోలో సింగింగ్ వంటి అంశాలలో ప్రథమ, కోకోలో ద్వితీయ స్థానాల్లో నిలిచి, ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. కళాశాలకు చెందిన మిద్ది ప్రవీణ్ కుమార్ దొర క్యాంప్ సీనియర్ కేడెట్‌గా, లెఫ్టినెంట్ బాషా క్యాంప్ అడ్జురెంట్‌గా సమర్థంగా విధులు నిర్వహించి క్యాంప్ కమాండెంట్ మేజర్ ఆసిఫ్ నుంచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు పొందారన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, డాక్టర్ శ్రీరామ్‌మూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ అభినందించారు.



వార్షిక ట్రైనింగ్ క్యాంపులో ప్రతిభ చూపిన ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

లంక భూములను పేదలకు పంపిణీ చేయాలి

సీతానగరం: ప్రభుత్వానికి చెందిన పోడు, సీలింగ్, లంక భూములను నియోజకవర్గంలోని పేదలకు సాగు చేసుకోవడానికి పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం చీపురుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగంపల్లి, చీపురుపల్లి, పెదకొండేపూడి, సీతానగరంలోని లంకభూములను నిరుపేదలకు అందజేయాలన్నారు. ఈనెల 4న అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని సీతానగరంలోని పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు. పోడు భూములను భూస్వాములు ఆక్రమించుకుంటున్నారని ధ్వజమెత్తారు. గిరిజన, పేద రైతుల వ్యక్తిగత దరఖాస్తులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో భూమి లేని రైతులతో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



చీపురుపల్లిలో పర్యటిస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

ఘనంగా వైద్యుల దినోత్సవం



వైద్యులను సత్కరిస్తున్న రొటేరియన్లు



నల్లజర్లలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి గంగాధరరావును సత్కరిస్తున్న పీఎంపీ, లయన్స్ క్లబ్ సభ్యులు



ఉండ్రాజవరం పీహెచ్‌సీలో డాక్టర్లు దుర్గామహేశ్వరరావు, ఉషాదేవిలను సత్కరిస్తున్న సిబ్బంది

దేవరపల్లి: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో వైద్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక డాక్టర్ సుమంత్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కేహెచ్ఎస్ సుమంత్‌ను మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల కార్యదర్శి డీఎస్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకట్రావు, జె.రాము, ఎస్.శ్రీనివాస్, పి.జాన్, సీహెచ్ కామరాజు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నల్లజర్లలో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావును ఘనంగా సత్కరించి, డాక్టర్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్డ్ ఇండియా సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షులు మహ్మద్ ఇలాయాజ్ షరీఫ్, గౌరవాధ్యక్షుడు చీమకుర్తి కృష్ణ ప్రసాద్, కోశాధికారి జీవీవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ఘనంగా జరుపుకొన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్.వెంకటరత్నం దంపతులను, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ గంగాధరరావును పీఎంపీ వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో మండల అసోసియేషన్ అధ్యక్షుడు సీతారామ్, కార్యదర్శి ధనుంజయరావు, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో డాక్టర్ సుమంత్‌ను సన్మానిస్తున్న పీఎంపీ

డాక్టర్లకు సన్మానం

ఉండ్రాజవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులైన డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు, డాక్టర్ ఆర్.ఉషాదేవిలను పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. దుర్గా మహేశ్వరరావు మాట్లాడుతూ పీహెచ్‌సీలో అందరూ బాగా పని చేసి మన పీహెచ్‌సీకి మంచి పేరు తీసుకొద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, డి.కుమారి, నారాయణ రెడ్డి, శ్రీరామమూర్తి, రత్నకుమారి, బ్యూలా, సంధ్యారాణి, రామకృష్ణ, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిడదవోలు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బూరుగుపల్లి అప్పారావు, ప్రభాకర్‌రావులతో పాటు చార్టెర్డ్ అకౌంటెంట్ పచ్చిపులుసు శ్రీరామారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ మీసాల హరిప్రసాద్, డి.ప్రతాప్, జి.సత్యసాయి, జి.శ్రీనివాసరావు, కామిశెట్టి సత్యనారాయణ, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్రప్రసాద్, జి.రంగారావు, గోపిరెడ్డి శ్రీను, కొర్లేపర రత్నకుమార్, వేదాల విజయలక్ష్మి, కేదారిశెట్టి రవికుమార్, మద్దుల సత్యనారాయణ, సానేపు వెంకట సుబ్బారావు, ఎండీ ఫయాజ్, ఉజ్జిన బలరాం తదితరులు పాల్గొన్నారు.